# అనసూయ

బిందుమాధవరావు ఎక్కువగా లోలోపల స్వగతాలు చెపుతుంటాడు.

ఆయనకు ఆనందవర్ధనుడంటే చాలా ఇష్టం !!

అందుకే పై మాటల్లో ధ్వని ఎక్కువగా వుంటుంది.

ఈ స్వగతాలకూ, ఈ ధ్వనికీ అనసూయ ముఖ్య కారణం.

"దీనితో ఏ విషయమన్నా ప్రత్యక్షంగా అన్నామో మనకింక ఇంట్లో మంచినీళ్ళు పుట్టవు" అనుకున్నాడు మాధవ్ స్వగతంలోనే !!

"అనసూయా ! నీకు మీ అమ్మా నాన్న చాలా అందమైన పేరు పెట్టారు. పేరుకూ గుణానికీ ఇంత చక్కగా పొత్తు కుదరడం లోకంలో చాలా అరుదు" అన్నాడు ఒకనాడు పైకి - అంటే ధ్వని !

ఇది ఎందుకన్నాడంటే ఆ రోజు మాణిక్యం అనసూయతో ఆచమ్మ పోచమ్మ కబుర్లు చెప్పుకోడానికి వచ్చింది.

అప్పుడు తను బెడ్‌రూంలో కూర్చొని ఏదో చదువుకుంటున్నాడు.

అనసూయ మాణిక్యమ్మలు సంభాషణలతో లోకభ్రమణం చేస్తున్నారు.

'నీకిది తెలుసా ? మోహనరావూ ఆయన భార్యా మొన్న సెకండ్‌షో సినిమాకు పోయారట !' అని చెప్పింది మాణిక్యమ్మ !

ఎలక్ట్రిక్‌షాక్ కొట్టినట్లు ఫీలయింది అనసూయ.

'దీనికేం రోగం ? ఎన్నడూ లేనిది ఇవ్వాళ ఈ అర్ధరాత్రి శృంగారమేమిటి ? ఎంత మొగుడయినా ఇన్నాళ్ళూ లేనిది ఇవ్వాళ ఎందుకు సినిమాకు పోవాలి ? అందులోనూ రెండో ఆటకు' అన్నది అనసూయ.

కిటికీలో నుండి బిందుమాధవరావు భార్య అవాకులూ చవాకులూ వింటూనే వున్నాడు.

'ఆఁ - అయితే ఈమె సినిమాలకు వెళ్ళడం మొదలు పెట్టిందన్నమాట. మొన్నటిదాకా ఏ జంటయినా సినిమాకెళ్తుంటే తానేదో పరదా స్త్రీ అయినట్లూ వాళ్ళేదో తప్పు చేసినట్లూ గుమ్మంలోంచి చూస్తుండేదే! ఇప్పుడు తనెట్లా పోయిందీ ?' సాధిస్తూ అడిగింది అనసూయ.

"ఓసే ! అనసూయా ! అనసూయా ! ఎవరో మొగుడూ పెళ్ళాం సినిమాకుపోతే నీకెందుకే ఆ టాపిక్ ?' అనుకున్నాడు బిందుమాధవరావు స్వగతం లోనే !!

"ఏదో వంక పెట్టుకొని రేపు శారదమ్మగారింటికి పోతాను - రెండో ఆటకెలా వెళ్ళావని అడుగుతాను - ఊరుకుంటానా ఏమిటి ? ఇన్నాళ్ళయింది పెళ్ళయి, ఎప్పుడూ మొగుడు ఆఫీసుకుపోతే మ్యాట్నీలకు తప్ప మొదటాట సినిమాకు పోయి ఎరుగనే ! ఈమె రెండో ఆట కెందుకు పోవాలో...."

'అందులోనూ టాక్సీలోనట -' మాణిక్యమ్మ ధూపం వేసింది -

'వీళ్ళ నడమంత్రపు సిరి మండ - ఆటోలుండగా టాక్సీలెందుకమ్మా ! మరీ చోద్యం ! అర్ధరాత్రి తమ దర్జా ఎవరికి చూపించాలనో -' నోరు నొక్కుకుంటూ అన్నది అనసూయ.

'సినిమాకు పోయే తొందరలో ఏ వెహికిల్ దొరికితే దానిలోనే పోతారు. దానికి నీ రాద్ధాంతమేమిటి అసూయా !' అనుకున్నాడు బిందు మాధవరావు స్వగతంలోనే !!

'అంతేకాదు మొగుడిచేత మొన్న రెండు డెకోలమ్ బెడ్స్ కొనిపించిందట !' మాణిక్యమ్మ దీపం ఎగదోసింది -

'అమ్మో ! అమ్మో ! డెకోలమ్ బెడ్సే ! వాళ్ళమాత్రం ముష్టి వైభవం మనకు లేకనా ఊరుకున్నదీ ! నువ్వు వందచెప్పు వెయ్యి చెప్పు మాణిక్యం. కేవలం తన్ను చూసి ఇతరులు అసూయపడాలనే శారదమ్మ డెకోలమ్ బెడ్స్ కొన్నది -

'ఔను - అంతే - అంతే -' అన్నది మాణిక్యం.

'చూస్తానుగా ఈ డెకోలమ్ బెడ్స్ సౌభాగ్యం అవెంత పాతవో, ఆ టేకు ఏ 'సి' వుడ్‌తో చేసిందో - చూస్తే తెలిపోదూ !'

'ఎందుకు తేలిపోదూ' మాణిక్యం వంతపాడుతున్నది.

శారదమ్మ సినిమా, శారదమ్మ డెకోలమ్ బెడ్స్ గూర్చి ఇలా మాణిక్యమ్మ, అనసూయలు ఓ గంటసేపు ధూపదీపనైవేద్యాదులతో అసూయాదేవతను ఉపాసించిన తర్వాత మాణిక్యమ్మ తోక రూడించుకుంటూ మళ్ళీ ఇంకో ఇంటికి పోయిన తర్వాత, బిందుమాధవరావు గదిలోంచి బయటకు వచ్చి అన్నాడు -

"అసూయా ! మీ అమ్మ నాన్న నీకు చాలా అందమైన పేరు పెట్టారు. పేరుకూ గుణాలకూ ఇంత చక్కగా కుదరడం చాలా అరుదు' అని.

"ఏం అలా అంటున్నారు ?" అదోలా చూస్తూ ప్రశ్నించింది అనసూయ.

"ఏం లేదు - శారదమ్మ డెకోలమ్ బెడ్స్ గూర్చి మీ సంభాషణ విన్నాను నిజంగా ఇంకో భార్యయితే "ఇప్పుడు నాకూ డెకోలమ్ బెడ్స్ కొనిపెట్ట"మని కూర్చునేది. నీవు కాబట్టి ఇంత నిర్మోహంగా ఉండ గలిగావు -" అన్నాడు బిందుమాధవరావు.

"చంపావు మొగుడా ! ముందు కాళ్ళకు బంధాలు వేశావు - అంటే ఇక డెకోలమ్ బెడ్స్ కొనిపెట్టమని నేను అడగకూడదన్న మాట" అనే భావాన్ని చూపులలో ప్రసరింపజేసింది అనసూయమ్మ !

బిందుమాధవం బుద్ధిమంతుడైన పిల్లవానిలా నిలబడ్డాడు -

"పోనీలే - ఇవ్వాళ ఏమయింది ?" అని అప్పటికి పూరుకున్నది అనసూయమ్మ !

మర్నాడు ఎలాగైతేనేం వీలుకల్పించుకొని శారదమ్మ దగ్గరికి పోయింది. శారదమ్మ ఆదరించి కాఫీ ఇచ్చింది -

అనసూయ కూర్చున్నదే కాని ఆమె కళ్లు శారద ఇంటి నలుమూలలా అన్వేషిస్తూనే వున్నాయి.

శారద ఇంటికి ఏమేమి కొత్త వస్తువులు వచ్చాయి ?

శారద ఇంకేమి కొనుక్కున్నది ??

బోడి గొప్ప, శారదకు ఉన్న దేమిటి, తనకు లేనిదేమిటి ??

డెకోలమ్ బెడ్స్ కంటపడ్డాయి -

"ఓహో - డెకోలమ్ బెడ్స్ కొన్నట్లున్నారు ?

"ఔను ! నేను వద్దంటున్నా మా ఆయన ఏదో ముచ్చటపడి తెచ్చారు - ఏమిటో ఆయన సరదాలు ఆయనవి - వద్దన్నా వినరు - ఏం మీరూ కొనుక్కుంటారా ?"

"నేనా ? నాకెందుకూ డెకోలమ్ బెడ్స్ ? నాకు హాయిగా స్టీలుబెడ్స్ వున్నాయిగా - ప్రతివాళ్ళూ రావడం - "అబ్బో ! మీ బెడ్స్ ఎంత బాగున్నా" యని పొగిడిపోవడం-నా మంచాలు చూసి అంతా అసూయపడిపోతున్నారంటే నమ్మండి"

శారద ఏం మాట్లాడలేదు -

అనసూయ శారదగారి బెడ్స్‌కు స్తనశల్యం పరీక్ష మొదలు పెట్టింది.

"మీదానికి 'సి'వుడ్ వాడారా ? 'బి'వుడ్ వాడారా ?"

"నాకు తెలియదండీ - ఆ తేడాలు - ఆయన కొన్నారు - పన్నెండు వందలయిందట - అంతే !!"

"అయితే మీ ఆయన కెవడో బాగాటోపీ పెట్టాడు. సి వుడ్‌కు పన్నెండు వందలా ? ఎంత నష్టపోయారు ? కనీసం ఇలాంటి విషయాలల్లో నన్ను సంప్రదించి వుండవలసింది"

"లాభమో నష్టమో ఏం చేస్తాం - రెడీమెడ్ షాపులో ఆ రేటు చెప్పారు - అలాగే అంతా కొనుక్కొని పోతున్నారట -"

"వాళ్ళ మొహంమండ - వాళ్ళట్లాగే చెపుతారండీ - మరి మనబుద్దేమయి నట్లు - కాస్త ఇంగితం ఉపయోగించి 'ఇది ఇంత వెల చేస్తుందా ? లేదా ?' అని

విచారించవద్దూ - డబ్బుకు డబ్బూ పోయింది - థర్డ్‌రేట్ మెటీరియల్ వచ్చింది -"

"పోనీలెండి -"

"పోనీలెండి అంటే ఏట్లా ? కావాలంటే మా స్టీలు మంచాలు చూడండి, అవి ఎంత ఖరీదో, వాటిని మేము ఎలా కొన్నామో, ఎన్నడైనా విచారించారా?"

శారదమ్మ ఏమీ మాట్లాడలేదు.

కావాలనే పెళ్ళిళ్ళ గూర్చి కట్నాల గూర్చి టాఫిక్ మార్చింది.

"మా చెల్లెలి పెళ్ళి నిశ్చయమైంది -"

'ఏమేం నగలు పెడుతున్నారో" అనసూయ ఆదోరకంగా ప్రశ్నించింది.

"మామూలుగా పెట్టేవన్నీ పెడుతున్నారు - అవికాక ఓ ముత్యాలసెట్ మొత్తం తీస్తున్నారు" అన్నది శారద -

"నా పెళ్ళికి మావాళ్లు రత్నాలసెట్ తీస్తామన్నారు - రత్నాలన్నా రాళ్ళే కదా - వద్దు పొమ్మన్నాను నేను" చాలా నిర్లక్ష్యంగా అన్నది అనసూయ -

"ఏమిటోనండీ - మనం వద్దన్నా వినరు. చిన్నదానికి తీసినప్పుడు పెద్ద దానికెందుకు తీయకూడదు ? అని మా నాన్న నాకూ ఒక ముత్యాలదండ చేయిస్తున్నారు."

అనసూయ లోలోపల బాడబాగ్ని భుగభుగలు -

"ముత్యాల నగ...."

"శారదకు ముత్యాల నగ...."

"ముత్యాల నగ...."

శారదమ్మ ఇంకేమిటో చెపుతున్నది కాని అనసూయ చెవులు పని చేయడంలేదు.

"ముత్యాల నగ...." ఈ మాటనే మళ్ళీ మళ్ళీ మననం చేస్తున్నది మనస్సు !

"వస్తానండి" బయటపడింది అనసూయ.

"సాయంత్రం రానీ ఈయన్ను! ముత్యాలసగకొనిపెట్టమని దంచుతాను" అనుకున్నది అనసూయ.

సాయంత్రం కొంచెం ఆలస్యంగా ఇంటికి వచ్చాడు బిందుమాధవరావు. ఇంట్లో దీపంలేదు.

తలుపులు దగ్గరవేసి వున్నాయి.

"ఓహో! అసూయాదేవి సత్యభామ వేషం వేసిందన్నమాట దేనికో." అనుకున్నాడు స్వగతంలోనే బిందుమాధవరావు.

స్విచ్ ఆన్ చేశాడు.

మంచంమీద అనసూయ.

"అనసూయా! ఏమిటలా పడుకున్నావు?"

"... ..................... .. ......"

"ఒంట్లో బాగాలేదా?"

"..........................."

దగ్గరకు వెళ్ళి గుండెలమీద చేయివేసి చూచాడు.

"నాకేం వైద్య పరీక్షలు చేయనక్కరలేదు" అనసూయ చికాకు పడింది.

"ఒళ్ళు చల్లగానే వున్నట్లుందే" మెల్లగా అనునయంగా మాధవుడు అన్నాడు.

"ఆఁ - మనస్సు మాత్రం వేడిగా వుంది" అనసూయ ఆగ్రహం!!

"అదేమిటీ నీకెన్నడూ కోపమనేదే రాదు. అలాంటిది ఇవ్వాళ ఎందుకబ్బా ఇంత కోపం వచ్చింది?"

"ఈ నయవంచనలు చాలు వెళ్ళండి"

"వెళ్ళను...."

"వెళ్ళకుంటే నేనే వెళ్తాను ఈ గదిలోంచి"

'ఓహో, అయితే నిజంగానే ఏదో కథ వుందన్నమాట-' బిందు మాధవ రావు ఓ నవ్వును ముఖానికి అంటించుకోని అనునయిస్తున్నాడు.

'నయవంచన చేయకండి. నిజం చెప్పండి. మీరు నాకెప్పుడైనా విలువైన ఒక వస్తువును కొనిపెట్టారా? ఎన్నడైనా నేను నోరు తెరిచి అడిగితే తెచ్చి పెట్టారా?'

'దేవుడా, ఇదేదో పెద్ద మొత్తానికి వచ్చినట్లుంది' బిందుమాధవ స్వగతాలాపం-

'అదేమిటి అనూ! నువ్వు అడిగిందెప్పుడూ, నేను కాదన్నదెప్పుడూ - నీవెప్పుడూ ఋషిపత్నిలా తొణకకుండా నిర్మోహంగా వుంటావే - అలాంటిది నీవు అడగడమూ నేను కాదనడమూనా-'

'ఈ మాటలు కట్టిపెట్టండి - ఏం అడక్కపోతే మాత్రం తెచ్చిపెట్ట కూడదా? ఎందరు మొగాళ్ళను చూస్తేనో ముచ్చటవుతుంది. ఇట్లా వూరికెళ్ళి చీరె తెస్తారు. అట్లా కాంప్‌కెళ్ళి దంతపు బొమ్మలు తెస్తారు - ఎరియర్స్ వస్తే చాలు ఓ బంగారం నగ చేయిస్తారు-'

'నీకు బంగారం నగేమిటి? రత్నాల నగే చేయిస్తాను కాని నగలా న్నటా అందం లేనివాళ్ళకు అనసూయా - నీ సౌందర్యం ముందు నగలు వెలవెల బోతాయి - మెడ బాగా లేకపోతే నగలతో కప్పుకోవాలి - నీదసలే శంఖంలాంటి మెడ - పుస్తకాలల్లోవాళ్ళు ఆ అలంకారాలు నీ మెడలాంటిదాన్నే చూసి రాస్తుంటారు.'

'ఆపండి మీ చాకచక్యం - మాటలతో నన్నిక బోల్తా కొట్టించలేరు - ఆ శారద, గుడ్డి గవ్వ చెయ్యని శారద....'

'అదేంమాట శారద లక్షలు ఖరీదు చేస్తుంది'

అనసూయ భద్రకాళి అయింది -

'అయితే ఊళ్ళో ఆడవాళ్ళని పొగుడుకుంటూ కూర్చోండి - నేనెందుకు? ఏ నుయ్యో గొయ్యో చూసుకుంటాను -'

'అరెరే! నీవెందుకో ఇవ్వాళ నా ప్రతిమాటనూ అపార్థం చేసుకుంటున్నావు-నా ఉద్దేశం అదికాదు - శారద వెనుక లక్షల ఆస్తి వుందని అంటున్నాను-అయినా వాళ్ళకా స్తివుంటే ఏం గొప్ప ? మనకంతకుమించిన అణకువ వుంది-నీకు లోకంలో ఎవరికీ లేనంత తృప్తి వుంది -'

'ఎట్లా వస్తుందండీ తృప్తి? పెళ్ళి అయిన తర్వాత మీరు నాకు కొని పెట్టిన బంగారమెంత - చెప్పండి-'

'నీవే సువర్ణానివి - నీకింక బంగారమెందుకు....'

'అవి చేతకాని మాటలు - నన్నిక నయవంచన చేయలేరు - ఇదుగో ఖచ్చితంగా చెపుతున్నాను జాగ్రత్తగా వినండి.'

'అల్టిమేటం ఇస్తున్నది - వందలకో వేలకో ఎసరు వచ్చింది' - అనుకున్నాడు బిందు మాధవరావు స్వగతంలో-

'ఏమిటి అనూ - చెప్పు-' కళ్ళతో ముక్కుతో నోటితో కూడా నవ్వుతూ అడిగాడు.

'వినండి. శారద ముత్యాల దండకు ఆర్డర్ ఇచ్చింది - దానికన్నా ముందు నాకు ముత్యాల దండ మీరు కొని తెచ్చి పెట్టాలి. అదిచూచి శారద ఏడ్చిపోవాలి. ఇది ఇరవై నాలుగు గంటల్లోగా జరగాలి తెలిసిందా?'

'ఇరవై నాలుగు గంటల్లోనా?'

'పోనీ నలభై ఎనిమిది గంటలు'

'అసంభవం అనూ - అందులో ఇది ఆఖరివారం....'

విచారంగా ముఖం పెట్టాడు.

'మీ అభినయాలు చాలించండి. మీరు మీ ఆఫీసులో నాటకాల్లో వేషాలు వేస్తారని తెలుసు - ఇక్కడ మాత్రం నాటకం ఆడవద్దు. సరిగ్గా మూడురోజులు టైము ఇస్తున్నాను - ముత్యాల నగ కావాలి - తెలిసిందా?'

'మూడురోజులు - అంటే ఇరవై నాలుగు ఇంటూ మూడూ ఈజ్ ఈక్వల్ టూ డెబ్భై రెండు గంటలు....'

'అంతే! డెబ్భైరెండు గంటల్లోగా ముత్యాలదండ తెచ్చి పెడితేనే నేను అన్నం ముట్టుతాను. లేకుంటే నామీద ఆశ వదులుకోండి.'

బిందు మాధవరావుకు డైలాగులు అందలేదు-

మామూలు సమయాలలో అయితే 'అనసూయా! నీవు కోపంలో కూడా చాలా అందంగా వుంటావు సుమా !' అనేవాడు.

"కోతిపిల్లకు సుందరీ అని పేరు పెడతారు-చిర్రుబుర్రులాడే దానికి శాంతి అని పేరు పెడతారు. కాని నీకట్లాకాదు నీకు రాబోయే గుణాలు ఊహించే అనసూయ అని పేరు పెట్టారు .." అని ఇలా ఆనందవర్ధనాచార్యుల వారిని ఆరాధించేవాడే . కాని ఇప్పుడా టక్కు-లేవీ పనికివచ్చేటట్లు లేదు....

"ఏం చేయను భగవంతుడా !" అంటూ అల్టిమేటమును స్వీకరించి ఇవతలికి వచ్చాడు బిందుమాధవుడు -

ఆ రాత్రి ఎలాగో గడిచింది -

మర్నాడు అనసూయ మొగుడితో మాట్లాడలేదు -

ఇరవైనాలుగు గంటలు గడిచాయి -

ఆ మరునాడూ బిందుమాధవానసూయల మధ్య సంవాదాలు లేవు -

అంటే నలభై ఎనిమిది గంటల మౌనయుద్ధం -

మూడోనాడు సాయంత్రం "అనూ - అనూ" అంటూ పరుగెత్తుకుంటూ వచ్చాడు మాధవుడు -

"ఇదుగో ముత్యాల దండ. ఆఫీసులో లోన్ చేసి కొన్నాను. ఇదిగో అలంకరించుకో. దీనితో నీ మెడ ధగధగ మెరిసిపోతుంది - ఇల్లు మొత్తం

రాత్రిళ్ళు కూడా తళ తళ మంటుంది - చూచిన వాళ్ళ కళ్ళు మలమల మాడి పోతాయి అసూయతో -"

"అబ్బ ! మీరెంత మంచివారండీ" గట్టిగా రెండు చేతులతో మొగుడి మెడను కావలించుకుంది అనసూయ -

కై దండతో తనను అలంకరించిన అనసూయను స్వయంగా ముత్యాల దండతో అలంకరించాడు మాధవుడు !

"ఇక చూడు - ఈ శారద పొగరు అణుస్తాను - తనే గొప్పదాన్నని దానికి తగని గర్వం" అనుకున్నది అనసూయ -

అనుకోవడమే కాదు -

మర్నాడు అన్నంత పనీ చేసింది -

తన దండను శారదకు ప్రదర్శించింది.

అంతేకాదు, 'ఈ దండను చూచి మా ఇంట్లో పక్కవాటాలోవాళ్ళు, కళ్ళల్లో నిప్పులు పోసుకుంటున్నారు' అంది.

"నాకొకరిని చూస్తే ఎన్నడూ అసూయ లేదు. అందరూ నన్ను చూసే అసూయ పడుతుంటారు" అన్నది -

ఇంకా ఏమేమో అన్నది -

శారద ఏమీ అనలేదు -

"బాగుందండీ" అని మాత్రం అని వూరుకున్నది.

అనసూయ మర్నాడు మాణిక్యమ్మను పిలిచింది -

దూపదీపాల మాణిక్యమ్మ వచ్చింది .

"మాణిక్యం, నీవో పని చేయాలి - నన్ను చూచి శారద అసూయ పడుతున్నదీ లేనిదీ కనుక్కొని రావాలి -" అన్నది అనసూయ .

'ఆ మాదిరి ఇతరులను చూచి అంత తేలికగా అసూయపడదు - నిన్న సాయంత్రం నేను వెళ్ళానుగా" అన్నది మాణిక్యం .

నీళ్ళు కారిపోయింది అనసూయ -

"ఎందుకు అసూయపడరు ? ప్రతివాళ్ళూ పడితీరుతారు - ఇంత కష్టపడి నగ కొనిపించుకున్న తర్వాత దాన్ని చూచి నలుగురూ అసూయ పడకపోతే ఇంక నాకెందుకీ నగ ? ? నేను నగ కొనుక్కున్నానని మాటమాత్రమైనా శారద అనలేదా అయితే...." అని అడిగింది అనసూయ.

"నిన్న సాయంత్రం శారద దగ్గరికి వెళ్ళాను - అప్పుడు శారద వాళ్ళ నాన్న ముత్యాల నగను చేయించి తెచ్చాడు. దానిని చూచి శారద అంది : "నాన్నా ! ఈ రోజుల్లో ఏవి మంచి ముత్యాలో ఏవి నకిలీ ముత్యాలో చెపితేకాని తెలియడంలేదు. ఈ బజారులో మా స్నేహితురాలు ఒక ముత్యాల దండ కొన్నది- అవి నిజం ముత్యాలేనని భ్రమపడుతున్నది. అయితే "మాధవరావు ఇవ్వాళ నకిలీ ముత్యాలదండ మా షాపులో కొన్నాడు" అని మీ అల్లుడు నిన్న రాత్రి నాతో మాటల సందర్భంలో అంటే ఆశ్చర్యపోయాను. ఆ షాపులో మీ అల్లుడికి పార్టనర్‌షిప్ వుందిలే" అని వాళ్ళ నాన్నతో అంటుండగా నేనూ విన్నాను" అని మాణిక్యం తన ధూపాన్ని ముగించింది ! !